
సీతారామ కల్యాణోత్సవానికి ఏర్పాట్లు



చాకరిమెట్లలోని సీతారామ చంద్రస్వామి ఆలయం



కొలువైన సీతారామ చంద్రస్వామి

శివ్వంపేట(నర్సాపూర్): శ్రీ రామనవమి పురస్కరించుకొని సీతారామ కల్యాణోత్సవం నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన పురాతన కోదండ రామాలయంతో పాటు చాకరిమెట్లలోని సీతారామ చంద్రస్వామి ఆలయాల్లో సీతారాముల కల్యాణం నిర్వహించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేసినట్లు వేద పండితుడు శాస్త్రుల వామనశర్మ, ఆంజనేయశర్మ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో సైతం కల్యాణోత్సవాలు, అన్నదానం చేసేందుకు గ్రామ పెద్దలు ఏర్పాట్లు చేస్తున్నారు.



బోనాల ఊరేగింపులో భక్తులు

వైభవంగా పోచమ్మ బోనాలు

పాపన్నపేట(మెదక్): మండలంలోని కొడుపాకలో సోమవారం పోచమ్మకు ఘనంగా బోనాలు ఊరేగించారు. అమ్మవారి ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా దేవతా మూర్తులకు అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఒడిబియ్యం పోసి సాయంత్రం బోనాలను ఊరేగించి అమ్మవారికి సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవాల్లో గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ విగ్రహప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు



కొలువైన పెద్దమ్మ

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని రాంపూర్ గ్రామ శివారులో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. రెండు రోజులుగా విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. వందలాది మంది భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేషారెడ్డి, గ్రామస్తులు, చుట్టు పక్క గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ డీఎస్ చౌహాన్

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని జప్తిశివునూర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా రికార్డులు తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బంది తలెత్తకుండా కొనుగోళ్లు వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు.

సీతారామ విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు



ఆలయంలో ప్రతిష్ఠించిన దేవతా మూర్తుల విగ్రహాలు

రామాయంపేట(మెదక్): మండలంలోని ప్రగతి ధర్మారంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈనెల 13న ప్రారంభమైన వేడుకలు 18న ముగుస్తాయి. ఉదయం గణపతి యుక్త హనుమాన్ సీతా, లక్ష్మణ, రామచంద్రస్వామి శిఖర ధ్వజ యంత్రస్థాపన నిర్వహించారు. అనంతరం దేవతా మూర్తుల స్థాపన, ఇతర కార్యక్రమాలు నిర్వహించారు. నిజాంపేట జెడ్పీటీసీ పంజా విజయకుమార్ ఆలయంలో పూజలు చేశారు.

నీటి ఇబ్బందులు లేకుండా చూడాలి



గ్రామ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా గ్రామ కార్యదర్శులకు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా, లీకేజీలు లేకుండా చూడాలన్నారు. నర్సరీల నిర్వాహణ, ఈజీఎస్ పనులపై వారికి సూచనలందించారు.

పోలీసుల కవాతు



కవాతు చేస్తున్న పోలీసులు

మనోహరాబాద్(తూప్రాన్): ఎన్నికల నేపథ్యంలో పోలీసులు మండలంలోని కోనాయపల్లి(పీటీ), చెట్లగౌరారం, రంగాయపల్లిలో సోమవారం ఫ్లాగ్‌మార్చ్ (కవాతు) చేశారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణ మాట్లాడుతూ.. ప్రజలు, నాయకులు ఎన్నికల నేపథ్యంలో శాంతియుతంగా వ్యవహరించాలని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ప్రజలను కోరారు. వీరి వెంట ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఎంపీపీ సబిత



మాట్లాడుతున్న ఎంపీపీ సబిత

చిన్నశంకరంపేట(మెదక్): తండాల్లో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సబిత అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సబిత అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పలు శాఖల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నార్సింగి తహసీల్దార్ షేక్ కరీం మాట్లాడుతూ.. పెద్ద తండాలో కొంత వరకు నీటి ఎద్దడి ఉందన్నారు. దానిని అధిగమించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తాగు నీటి సమస్య, నర్సరీ మొదలగు వాటికి ట్యాంకర్లతో సాధ్యమైనంత వరకు తీర్చే ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామంలో భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతలు, నీటి గుంతలు, కందకాలు ఏర్పాటు చేయడంలో గ్రామస్తులు, అధికారులు సహకారం అందించాలని కోరారు. గ్రామ కార్యదర్శులకు కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాల బాధ్యత ఉందని, కొనుగోలు కేంద్రాల్లో వసతుల ఏర్పాట్లు చూసుకోవాలని సూచించారు. ఎంపీఓ నరేశ్ మాట్లాడుతూ.. 98 శాతం పన్నులు వసూళ్లు జరిగాయని తెలిపారు. ఎంపీడీఓ చిన్నారెడ్డి మాట్లాడుతూ.. మండల ప్రజలకు ఎండ దెబ్బ తగలకుండా గ్రామ కార్యదర్శులు ఏర్పాట్లు చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద, గ్రామ పంచాయతీల వద్ద, అంగడుల్లో గ్రామాల్లో సందర్శించే ప్రజలకు మంచి నీటితో పాటు ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలని అన్నారు. ఎంఈఓ బుచ్యా నాయక్ మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఆదేశాల అనుసారం పాఠశాలలో మా ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేశామని, కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలలో వసతుల ఏర్పాట్లు, మిగులు పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ఏపీఓ ఇన్‌చార్జి రాజేశ్ మాట్లాడుతూ.. ఎన్ఆర్ఈజీఎస్‌లో మండలానికి జిల్లాలో ప్రథమ స్థానం, రాష్ట్రంలో ఆరవ స్థానం వచ్చిందని, అందరి సహకారంతోనే ఈ ఘనత సాధించామన్నారు. భవిష్యత్‌లో ఇంకా పట్టుదలతో ముందుకు సాగాలని అన్నారు. మండల వైద్యాధికారి డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ.. ఎండలు తీవ్రంగా ఉన్నాయని, ప్రజలు మధ్యాహ్నం 12 నుంచి 4 గంటల వరకు ఇంటికే పరిమితం కావాలని, తప్పనిసరి పరిస్థితుల్లో తగు జాగ్రత్తలు తీసుకొని బయటకు రావాలని సూచించారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఎదురైనా వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి చికిత్స తీసుకోవాలన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ.. మండలంలో కొన్ని గ్రామాల్లో నీటి సమస్య ఉన్నదని, ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్నందున సమస్యల పరిష్కారం కోసం ఎక్కువగా చేయలేక పోతున్నానని తెలిపారు. సాధ్యమైనంత వరకు మిషన్ భగీరథ, నీటి ట్యాంకర్ల ద్వారా సాధ్యమైనంత వరకు పరిష్కారం చేసేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. కోడ్ ముగిసిన అనంతరం సమస్యల శాశ్వత పరిష్కారం చేపడతామన్నారు. మండల అభివృద్ధి, సమస్యల పరిష్కారం కొరకు అన్ని శాఖల అధికారుల సహాయ సహకారాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుజాత శంకర్, ఎంపీటీసీలు సుజాతగౌడ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న హెచ్ఎం బాలచంద్రం, ట్రస్ట్ నిర్వాహకులు

శివ్వంపేట(నర్సాపూర్): ప్రతీ విద్యార్థి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని శివ్వంపేట ఉన్నత పాఠశాల హెచ్ఎం బాలచంద్రం అన్నారు. సోమవారం పాఠశాల ఆవరణలో జ్ఞాన సరస్వతి సేవా సమితి ట్రస్ట్ నందివనపర్తి ఆధ్వర్యంలో సరస్వతీ మాత విగ్రహ ప్రతిష్ఠ చేపట్టాగా.. సోమవారం హెచ్ఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థికి సరస్వతి కటాక్షం పొందేందుకు కృత నిశ్చయంతో ముందడుగు వేయాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో చదువుకు ఉన్న ప్రాధాన్యత మరేదానికి లేదన్నారు. పాఠశాలలో సరస్వతీ విగ్రహ ఏర్పాటుకు కృషి చేసిన ట్రస్ట్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిషన్‌రావు, పంతులు రాఘవేంద్రశర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భగీరథ నీటిపైప్ లీకేజీ



రహీంగూడకు వెళ్లే దారి మధ్యలో లీక్ అవుతున్న భగీరథ నీరు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని రహీంగూడ తండాకు వెళ్లే దారిలో బీటీరోడ్డు మధ్యలో మిషన్ భగీరథ ప్రధాన పైప్ నుంచి నీళ్లు లీకేజీ అవుతున్నాయి. సుమారు ఆరు నెలలుగా ఈ నీటి లీకేజీ జరుగుతోంది. ఈ విషయమై మిషన్ భగీరథ ఏఈ సురేశ్‌ను వివరణ కోరగా.. నీటి లీకేజీ జరుగుతున్న విషయం వాస్తవమేనని, ఆ లీకేజీ ప్రధాన పైప్ నుంచి అవుతుందని, రోడ్డుకు ఇరు వైపులా కల్వర్టులు ఉన్నాయని, మరమ్మతులు చేయిస్తే మూడు రోజులు పడుతుందని, మూడు రోజుల పాటు మండల వ్యాప్తంగా నీటి సరఫరా ఆగిపోతుందన్నారు. గ్రామాల్లో తాగు నీటి సమస్య లేకుండా త్వరలోనే ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ఓటు హక్కును అందరూ వినియోగించుకోవాలి

చేగుంట(తూప్రాన్): ఓటు హక్కును అందరూ వినియోగించుకోవాలని తహసీల్దార్ గియాసున్నీసాబేగం అన్నారు. సోమవారం చేగుంటలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు బీఎల్ఓలతో ఓటరు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో పోలింగ్ గొప్ప అంశంగా అందరు గుర్తించుకోవాలని తెలిపారు. పోలింగ్‌ను కొందరు వినియోగించుకోలేక ఓటింగ్‌లో పాల్గొనకుండా ఉంటున్నారన్నారు. అన్ని గ్రామాల్లో ఓటింగ్ శాతం పెంచి ప్రజాస్వామ్యం కాపాడుకోవాలన్నారు. వచ్చే నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్‌లో పాల్గొనాలని గాంధీ చౌరస్తాతో పాటు బస్టాండ్‌లో ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి నీరజ, ఉపాధ్యాయులు లక్ష్మణ్, ఆర్ఐ నర్సింగ్‌యాదవ్, బీఎల్ఓలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాలకు రామాచలం ఆలయం ముస్తాబు



ముస్తాబైన రామాచలం ఆలయం

టేక్మాల్(మెదక్): మండలంలోని వెల్పుగొండ గ్రామంలో రామచలం కొండపై వెలసిన దివ్య క్షేత్రం సీతారాముల ఆలయం. సీతారాముల 40వ కల్యాణ మహోత్సవాలు ఈనెల 15 నుంచి 17 వరకు ఉత్సవాలు రామచలం కొండ ఆత్మనంద ఆశ్రమ పీఠాధిపతి రాజయోగి వెంకటస్వామి ఆధ్వర్యంలో జరగనున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీరామనవమి మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

పరామర్శ



బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని సూరారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కరణం పెద్ద సిద్దిరాములు ఆదివారం మేడ్చల్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి సోమవారం సూరారంలో బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు.

నీలంమధును గెలిపించండి

చేగుంట(తూప్రాన్): కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలంమధును భారీ మెజార్టీతో గెలిపించాలని ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు బలరాం అన్నారు. రెడ్డిపల్లిలో ఆయన ప్రచారం సమావేశంలో మాట్లాడుతూ.. బీసీ అభ్యర్థిగా నీలంమధుకు అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీని బీసీలు గుర్తించాలని తెలిపారు. సమావేశంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు నర్సింహ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు శ్రీకాంత్, నసీరొద్దీన్, జ్ఞానేశ్వర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందికి వేతనాలు చెల్లించండి



జూనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న నర్సమ్మ

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామ పంచాయతీ సిబ్బందికి ఉన్న పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ అన్నారు. సోమవారం ఆమె మండల కేంద్రం కౌడిపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ సిబ్బందికి వేతనాలు చెల్లించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంచాయతీ సిబ్బందికి ఆరు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో వారు కుటుంబాలను పోషించుకోలేక నానా అవస్థలు పడుతున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు నెల ఒకటవ తేదీన జీతాలు చెల్లించడానికి ఉన్న బడ్జెట్, పంచాయతీ సిబ్బందికి ఇవ్వడానికి లేదా అని ఆమె ప్రశ్నించారు. గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్న పంచాయతీ కార్మికులకు జీతాలతో పాటు, వారికి నిత్యావసర సరుకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20 వరకు జీతాలు చెల్లించకపోతే పనులు నిలివేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పద్మారావు, నర్సింలు, పుష్ప, అనుసూయ, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తవద్దు



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆనంద్

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామాల్లో తాగు నీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. సోమవారం మండల కేంద్రం చిలప్‌చెడ్‌లోని ఎంపీడీఓ కార్యాయలంలో ఆయన పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యం వందశాతం ఉండేలా చూడాలన్నారు. మిషన్ భగీరథ నీళ్లు రాని, గ్రామాల్లో బోర్ నీళ్లు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మోటార్ల మరమ్మతులు ఉంటే వెంటనే చేయించాలన్నారు. పల్లె ప్రకృతి వనం, నర్సరీ మొక్కలకు రోజుకు రెండు సార్లు నీళ్లు పట్టాలన్నారు. వారంలో మూడు రోజులు తప్పనిసరిగా చెత్త సేకరణ జరగాలన్నారు. ఒక రోజు డ్రైడే నిర్వహించాలన్నారు. దోమల నివారణకు బ్లీచింగ్, ఆయిల్‌బాల్స్ వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శరత్‌రెడ్డి, ఏపీఓ శ్యామ్ పాల్గొన్నారు.

చెక్‌పోస్టు వద్ద నగదు పట్టివేత



నగదును స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు



పెద్దశంకరంపేట(మెదక్): కోళాపల్లి వద్ద ..

హవేళీఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని పోచమ్మరాళ్ చెక్‌పోస్టు వద్ద కారులో రూ.1.80లక్షల నగదును పట్టుకున్నట్లు హవేళీఘణాపూర్ ఎస్ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు. ఎల్లారెడ్డి నుంచి నితిన్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి కలిసి కారులో తరలిస్తుండగా వాహనాల తనిఖీల్లో పట్టుబడినట్లు ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో ఎఆర్ఎఫ్ సిబ్బంది, హెడ్‌కానిస్టేబుల్ విఠల్ ఉన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని కోళాపల్లి పాత టోల్‌గేట్ వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎలాంటి అనుమతి లేకుండా రూ.1 లక్ష నగదు తీసుకెళ్తున్న మహారాష్ట్రలోని డెగ్లూర్‌కు చెందిన యోగేష్ నుంచి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శంకర్ సోమవారం తెలిపారు. మారుతి ఆల్టో కారు (ఎంహెచ్ 42 కె 7742)లో నగదు తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ఎలాంటి అనుమతి లేకుండా రూ.50 వేల కంటే ఎక్కువగా నగదు తీసుకెళ్లొద్దని సూచించారు.

రామాలయంలో స్వామివారికి అంకురార్పణ



అంకురార్పణలో మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ, నాయకులు

తూప్రాన్: పట్టణ సమీపంలోని రామాలయం వద్ద సీతారాముల ఉత్సవాల్లో భాగంగా సోమవారం అంకురార్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఉదయ్‌కుమార్‌శర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్రీనివాస్, నాయకులు రవీందర్‌గుప్తా, రఘుపతి మాజీ ఎంపీటీసీ తిమ్మాపురం నర్సింలు, జంగం యాదగిరి, బాలరాజ్, లింగం, నాగులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవం

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ధర్మారం గ్రామంలో పెద్దమ్మ ఆలయ ఆలయ ద్వితీయ వార్షికోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి బోనాలు ఊరేగించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి బోనాలు సమర్పించి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సుహాసినిరెడ్డి, మండల అధ్యక్షుడు మహేశ్ రెడ్డి, జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బోనాల ఊరేగింపులో భక్తులు